వర్షాలకు కూలిన నాలుగు ఇండ్లు

- **బాధితులు దరఖాస్తు చేసుకోవాలి**

కోటగిరి, జూలై 31: మండలంలోని కొత్తపల్లి, ఎత్తొండ గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో కురిసిన వానలకు నాలుగు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ సునీత తెలిపారు. ఇటీవల వారంలో కురిసిన వర్షాలకు 24 ఇండ్లు పేర్కొన్నారు. పరిహారం కోసం బాధితులు ఇల్లు ధ్వంసం అయిన ఇంటి ఫొటోతో పాటు దరఖాస్తు ఫారాలను తహసీల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పొంగి పొర్లుతున్న కప్పలవాగు

గడ్కోల్ వద్ద ప్రవహిస్తున్న కప్పలవాగు

సిరికొండ, జూలై 31 : మండలంలోని కప్పలవాగు పొంగి పొర్లుతున్నది. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో కప్పలవాగు పొంగి పొర్లుతున్నది. వర్షాలు కురుస్తుండడతో పంటలకు మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి'

ఇందల్వాయి, జూలై 31 : రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాయుడి రాజన్న డిమాండ్ చేశారు. రైతులు, బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ వెంకట్‌రావుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, అర్హులకు రేషన్ కార్డులు అందజేయడంతో పాటు ఇండ్లు, సబ్సిడీ గ్యాస్‌ను అందజేయాలని కోరారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్పల్లి, జూలై 31 : చెరువులో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. రామడుగుకు చెందిన దుమాల కవిత (43)కు మతిస్థిమితం లేదు. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం మధ్యాహ్నం గ్రామ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

వినాయక్‌నగర్, జూలై 31 : జిల్లాకేంద్రంలోని గాయత్రీనగర్‌కు చెందిన సాయికుమార్ (21) లేబర్‌గా పనిచేసేవాడు. సదరు యువకుడు బోర్గాం వద్ద కల్లు బట్టిలో బుధవారం మద్యం సేవించాడు. అదే ఏరియాలో ఉన్న కాలువ వద్ద కాలుజారి పడిపోవడంతో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఫోర్త్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షాలకు నగరంలోని గాంధీ చౌక్ ట్రాఫిక్ పాయింట్ వద్ద ఏర్పడిన గుంతను మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వప్న బుధవారం పూడ్చివేశారు. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించిన బకెట్‌లో మట్టిని తెచ్చి పూడ్చివేయడంపై స్థానికులు అభినందించారు. –వినాయక్‌నగర్, జూలై 31

విద్యార్థులకు షూ వితరణ

వేల్పూర్, జూలై 31: మోతె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 235 జతల షూ వితరణ చేసినట్లు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఇస్సాపల్లి రవి బుధవారం తెలిపారు. ఆయన ఎస్‌బీఐ కామారెడ్డి బ్రాంచ్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ రాజేశ్వర్, మేనేజర్ మిత్ర బృందం చేతుల మీదుగా విద్యార్థులు అందజేశారు.

టై, బెల్ట్‌లు పంపిణీ.. భీమ్‌గల్, జూలై 31: స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్ట్‌లను హెచ్ఎం సత్యరమేశ్ కుమార్ సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అందజేశారు. ఎంఈవో స్వామి, టీచర్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Public in general are hereby informed that my client Kothmirkar Madan S/o. Kotimirkar Madhoji, age 72 years, Occ: Business, R/o.H.No. 2-5-85,Jawahar Road, Nizamabad is entering into agreement of sale in respect of schedule property mentioned below and the vendor Jaikumra Kaurani S/o. Laxman Das Kaurani, age 41 years, Occ; Business, R/o. H.No.5-6-595, Pragathinagar, Nizamabad has disclosed all the facts and shown all the documents pertaining to schedule property shown below and very soon get it register so, any person or persons have any claim in respect of schedule property may come forward with all the original, legal and authenticated, admissible in law within **7 days** from the date of this publication failing which my client will proceed ahead and get the property registered on his name or on any person whom he feels proper and correct

SCHEDULE OF PROPERTY

The existing open place (dismental house) bearing Municipal (old) No.4-4-335, new No.4-4-62/a, situated in Ward No.4 and Block No.4 at Rashtrapathi Road, Nizamabad, admeasuring 21.87 Sq,yds., or 18.27Sq,mts., within the Municipal corporation limits of Nizamabad, **Bounded by :- North** : Rashtrapathi Road, **South** : Premises of Neighbours ,**East** : Open place of Akula Narsing Rao,**West** : Passage of Neighbours.

Sd/- T.GANGADHAR, Advocate
H.NO: 6-25-188,Dubba, Nizamabad
Cell:9849107614

జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డుపై పశువులు

జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మగుట్ట రోడ్డుపై..

రోడ్లపైనే పశువులు

ప్రయాణికుల ఇబ్బందులు చర్యలు చేపట్టాలని కోరుతున్న వాహనదారులు

కంఠేశ్వర్/ కోటగిరి, జూలై 31 : జిల్లాకేంద్రంలో ప్రతిరోజూ ఉండే రద్దీ అంతా ఇంతా కాదు. అలాంటి రద్దీగా ఉండే రోడ్లపై పశువులు ఉండడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించడంతోపాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వేగంగా వెళ్లే వారు గమనించకపోతే రోడ్డు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రమాదాలు జరిగితే బాధ్యులు అధికారులా? లేక పశువుల యజమానులా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై పశువులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో ఎప్పుడూ రద్దీగా ఉండే బస్టాండ్, కోర్టు చౌరస్తా, పాత బస్టాండ్, గాంధీచౌక్, పోలీస్ కమిషనరేట్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో రోడ్లపై మూగజీవాలు ఉండడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల సంఖ్యలో తిరిగే వాహనాలకు ఆవులు, ఎద్దు, గేదెలు రోడ్డుపై కూర్చొని ఉండడంతో ప్రయాణికులు తమ వాహనాలకు బ్రేకులు వేయాల్సిన పరిస్థితి వస్తున్నది. ముందు వెళ్తున్న వాహనాల కారణంగా రోడ్డుపై ఉన్న పశువులు కనిపించక చాలా మంది రోడ్డుప్రమాదాల బారిన పడి గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. మూగజీవాలను యజమానులు తమ ఇండ్ల వద్దనే కట్టి వేయాలని, రోడ్డుపై వదిలితే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కోటగిరి మండలకేంద్రంలోని ప్రధాన రహదారులపై పశువులు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటగిరి బస్టాండ్ ప్రధానరహదారిపై పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కోటగిరి బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్న పశువులు

మొక్కలకు రక్షణ కరువు..

కంఠేశ్వర్, జూలై 29 : జిల్లాకేంద్రంలో మొక్కలకు రక్షణ కరువైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్ల మధ్యలో మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం మొక్కలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కంఠేశ్వర్ రోడ్డులో డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలను పశువులు మేస్తున్నాయి.

టీయూలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ

డిచ్‌పల్లి, జూలై 31 : టీయూలో కామర్స్ విభాగం డీన్ ఆచార్య రాంబాబు గోపిశెట్టి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ ఆన్ యూనియన్, స్టేట్ బడ్జెట్ –2024 పై బుధవారం చర్చ జరిగింది. ముఖ్యఅతిథిగా టీయూ రిజిస్ట్రార్ .యాదగిరి హాజరై మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థను ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాల్లో బడ్జెట్ ప్రధానమైనదన్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు, సామాజిక న్యాయం, ధరల స్థిరత్వం, అంతర్జాతీయ చెల్లింపుల సమతూల్యతలు బడ్జెట్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లపై సమీక్షించారు. కో–ఆర్డినేటర్ ఆచార్య రాంబాబు పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకంగా సర్టిఫికెట్‌తోపాటు వాణిజ్యశాస్త్ర పుస్తకాలను అందించారు. ఉత్తమంగా బడ్జెట్ ప్రజెంట్ చేసిన నలుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఆచార్య ఆంజనేయులు, ఆచార్య సంపత్‌కుమార్, డాక్టర్ పున్నయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, కె.అపర్ణ, కైసర్ మహ్మద్, సీహెచ్.శ్రీనివాస్, వి.దత్తహరి, గంగాధర్, జి.శ్రీనివాస్, శ్వేత, పిట్ల సరిత, కిరణ్ రాథోడ్, రాజు పాల్గొన్నారు.

నగరంలోని దేవీరోడ్డు వద్ద బుధవారం రాత్రి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ మార్గాల గుండా వచ్చే వారితో జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. అక్కడే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. కానీ ట్రాఫిక్‌ను క్లియర్ చేయకపోవడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. – వినాయక్‌నగర్, జూలై 31

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

కమ్మర్‌పల్లి రైతువేదికలో రైతులతో సమావేశమైన ఆర్డీవో

మోర్తాడ్,జూలై31: 63వ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంపై అభ్యంతరాలుంటే దరఖాస్తు ద్వారా తెలియజేయాలని ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం కమ్మర్‌పల్లి రైతువేదికలో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ...కమ్మర్‌పల్లికి చెందిన మొత్తం 140 మంది రైతులకు సంబంధించి 60.80 ఎకరాల భూమిని సేకరించామని, ఇందులో రైతుల భూముల కొలతల్లో తేడాలు, ఇతర సందేహాలు ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

గొడ్డలితో దాడి చేసిన కేసులో నిందితుడికి రూ.25వేల జరిమానా

శక్కర్‌నగర్, జూలై 31: పొతంగల్ మండలం కారేగాం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల యాదవరావుపై గొడ్డలితో దాడికి పాల్పడిన ఎర్రోల్ల రమేశ్ బాధితుడికి రూ. 25 వేలు చెల్లించాలంటూ, లేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. లైజన్ అధికారి కథనం మేరకు.. ఎర్రోల్ల యాదవరావు పిల్లలు ఎదురింటి ఎర్రోల్ల రమేశ్‌కు చెందిన పిల్లలు 11 సెప్టెంబర్, 2023న సాయంత్రం ఆడుకుంటూ కొట్లాడుకున్నారు. యాదవరావు మందలించడంతో రమేశ్ భార్య అతడిని బూతుపదజాలంతో దూషించింది. వెంటనే తన భర్త రమేశ్‌కు చెప్పడంతో ఆయన కోపంతో గ్రామంలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఉన్న యాదవరావుపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. యాదవరావు భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు రమేశ్ రూ.25వేలు చెల్లించాలని బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసు సాక్షుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య వాదించారు. ఈ కేసులో ఎస్సై సందీప్, రుద్రూర్ సీఐ జయేశ్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ విధులు నిర్వహించారు.

భీమ్‌గల్‌లో అర్ధరాత్రి చోరీ

భీమ్‌గల్,జూలై 31: పట్టణంలోని బోయిగల్లీలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. కొత్వల శ్రీనివాస్ ఇంట్లో అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడ్డారు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న గదికి గడియ పెట్టి మరో గదిలోకి చొరబడ్డారు. బీరువాను ధ్వంసం చేసి 3 తులాలు బంగారు , 40 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయాల్లో..

ఎడపల్లి,జూలై 31: మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామ రామాలయం, బాపూనగర్ సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్సై వంశీకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. రామాలయంలోని హుండీ నుంచి సుమారు రూ.1500, బాపునగర్ సాయిబాబా ఆలయ హుండీలోని సుమారు రూ.1000 చోరీ అయ్యాయని ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో..

వినాయక్‌నగర్, జూలై 31: నగరంలోని డ్రైవర్స్‌కాలనీలో మంగళవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య కథరం ప్రకారం.. అబ్దుల్ రహీమాన్ ఇంట్లో వారికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో జిల్లా ప్రభుత్వ దవాఖానకు వెళ్లి అడ్మిట్ అయ్యారు. బుధవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడం, బీరువా ధ్వంసం చేసి ఉన్నది. బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'ప్రజలు, రైతులను మభ్యపెడుతున్న కాంగ్రెస్'

మోర్తాడ్, జూలై31: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు, రైతులను రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెడుతోందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, బాల్కొండ ఇన్‌చార్జి మోహన్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పాస్‌బుక్ ఉన్న ప్రతిరైతుకూ రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయాలన్నారు. రూ.4వేలు, రూ.6వేల పింఛన్ అమలు చేయాలని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు.

నిరుపేదలకు అల్పాహారం పంపిణీ

బోధన్, జూలై 31: పట్టణ శివారులోని ఆటోనగర్‌కు చెందిన పలువురు నిరుపేదలకు బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ రాయల్ ప్రధాన కార్యదర్శి దమ్మల్ల జ్యోతిరాజ్ అల్పాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

17న యువ కళోత్సవ్

ఈనెల 17న నిర్వహించనున్న యువ కళోత్సవ్ 2024 (జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమం) సంబంధించిన పోస్టర్లను ట్రాస్మ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం బుధవరాం ఆవిష్కరించారు. జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోగటి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు. – మాక్లూర్, జూలై 31

విద్యార్థులకు ప్రోత్సాహం

టెన్త్ వార్షిక పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆల్గోట్ అక్షయ, గుమ్మిర్యాలకు చెందిన ప్రవళికకు గోర్తి ఈశ్వర్‌ట్రస్ట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సభ్యులు రూ.3వేల చొప్పున నగదు పురస్కారాన్ని బుధవారం అందజేశారు. వచ్చే సంవత్సరం పదో తరగతిలో 10జీపీఏ సాధించే విద్యార్థులకు రూ.5వేల చొప్పున పురస్కారం అందజేస్తామని ట్రస్టు చైర్మన్ తెలిపారు. హెచ్ఎం కృష్ణమాచారి, టీచర్లు పాల్గొన్నారు.– ఏర్గట్ల, జూలై 31

లా విద్యార్థులకు మౌఖిక పరీక్ష

డిచ్‌పల్లి, జూలై 31 : టీయూలోని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నమూనా మూట్ కోర్ట్ మౌఖిక పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఎక్స్‌టర్నరల్ ఎగ్జామినర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది రమాగౌడ్ హాజరయ్యారు. సంఘర్షన్ వాజ్యముల విచారణపై పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ కె.ప్రసన్న రాణి, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగజ్యోతి, న్యాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో పలువురి బదిలీ

ఇందల్వాయి, జూలై 31 : అటవీశాఖలో పలువురు సెక్షన్, బీట్ అధికారులు బదిలీ అయినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి రవిమోహన్ భట్ బుధవారం తెలిపారు. ధర్పల్లి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారిగా విధులు నిర్వర్తించిన ఆసిఫుద్దీన్ హైదరాబాద్‌లోని విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. యానంపల్లి సెక్షన్ అధికారిగా ఉన్న పి.బాపురావు కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని కోనాపూర్‌కు, సుబ్బారావు జాతీయ రహదారి నుంచి కొడిమ్యాల రేంజ్ పరిధిలోని గోవిందర్‌రాంనకు, ఆనంద్‌నాయక్ అన్సాన్‌పల్లి నుంచి కడెం రేంజ్ పరిధిలోని గంగాపూర్‌నకు, సురేందర్ హోన్నాజిపేట్ నుంచి ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్‌నకు బదిలీపై వెళ్లారు. వీరితో పాటు ఐదుగురు బీట్ అధికారులు బదిలీ అయినట్లు తెలిపారు. ఇందల్వాయి రేంజ్ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుమలత సెక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. బదిలీ అయిన వారిని ఫారెస్ట్ రేంజ్ అధికారి సన్మానించారు.

డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

ఖలీల్‌వాడి, జూలై 31 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ముందు కళాశాలలో తప్పనిసరిగా సంప్రదించాలని సూచించారు.

నిజామాబాద్ అర్బన్ ఎంఈవోగా సేవ్లా

ఖలీల్‌వాడి, జూలై 31: నిజామాబాద్ అర్బన్ ఎంఈవోగా సేవ్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేస్తున్న రామారావు త్వరలోనే ఉద్యోగ విరమణ పొందనున్నందున గాంధారి నుంచి సేవ్లా బదిలీపై వచ్చారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి

ముప్కాల్, జూలై31: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని ప్రియూనిక్ కంపెనీ క్లస్టర్ అధికారి రాజేందర్ సూచించారు. ఉద్యానవనశాఖ, ప్రియూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో మెండోరాలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 90 శాతం రాయితీతో ప్రభుత్వం మొక్కలను అందిస్తుందని, ఎరువుల ఖర్చుకు ఎకరానికి రూ.4200 ఇస్తుందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు, రెయిన్‌కోట్ల పంపిణీ

మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో అనంతరావు

ఇందల్వాయి, జూలై 31 : మండలంలోని సిర్నాపల్లిలో ఎంపీడీవో అనంతరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటి ఆవరణలో కనీసం ఆరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం జీపీ సిబ్బందికి రెయిన్ కోట్లను ఎంపీడీవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఈ కిషన్, దీప్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పోరాటం తాత్కాలిక వాయిదా

ఖలీల్‌వాడి, జూలై 31 : లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పోరాటం తాత్కాలిక వాయిదా వేసినట్లు కార్మికులు, యూనియన్ నాయకులు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేబర్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్, యూనియన్ మధ్య బుధవారం చర్చలు జరిగాయి. రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలతో పాటు సమ్మెకాలపు వేతనాన్ని చెల్లించాలని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసి విధుల్లో చేరాలని నిర్ణయించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. వచ్చే నెల 13వ తేదీన మళ్లీ చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తరపున ప్రతినిధి రాజ్‌కుమార్, రాజేశ్, ఇరిగేషన్ అధికారుల తరపున ఈఈ రాజ్‌కుమార్, కార్మికుల తరపున యూనియన్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు గణేశ్, నాయకులు కార్తీక్, సందీప్, బుచ్చన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఆడబిడ్డను అవమానించడాన్ని ఖండిస్తున్నాం

ఖలీల్‌వాడి, జూలై 31 : అసెంబ్లీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్‌రావు అన్నారు. మాజీ మంత్రిని అవమానించడం తెలంగాణ ఆడబిడ్డలని అవమానించినట్లేనని, సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

- **వాహనాల తనిఖీ-** చందూర్, జూలై 31 : మండలకేంద్రంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు.
- **ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం-** కోటగిరి/ రుద్రూర్/ డిచ్‌పల్లి, జూలై 31: కోటగిరి మండలంలోని ఎత్తొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ మల్లారెడ్డి ఉద్యోగ విరమణ పొందగా.. దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, ఎంఈవో నాగ్‌నాథ్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రుద్రూర్ ఎంపీవో సాయిలు ఉద్యోగ విరమణ పొందడంతో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీవో దంపతులకు సన్మానించారు. ఖిల్లా డిచ్‌పల్లి స్కూల్‌లో ఎస్ఏగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన శంకర్‌ను ఆయన చిన్ననాటి స్నేహితుడు, సామాజిక, రైతు ఉద్యమనేత కోటపాటి నర్సింహనాయుడు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ భాషిత స్కూల్ ఫౌండర్ పోలేపల్లి సుందర్, మేడిదపల్లి స్కూల్ హెచ్ఎం కుంట శ్రీనివాస్‌రెడ్డి, ఇస్సాపల్లి శేఖర్‌రెడ్డి, సాగర్, సునీల్‌కుమార్ కులకర్ణి పాల్గొన్నారు.
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం -** డిచ్‌పల్లి, జూలై 31 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లికి చెందిన నారం లక్ష్మి (కర్రెవ్వ) (76) అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. అంత్యక్రియల నిర్వహణ కోసం బాధిత కుటుంబానికి గల్ఫ్ సభ్యులు 10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఒడ్డెం తులసీదాస్, జలగడుగుల అశోక్, భాజన్న, సందీప్, నరేశ్, సుమన్, భూమయ్య, చిట్టీ తదితరులు పాల్గొన్నారు.
- **వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి-** శక్కర్‌నగర్, జూలై 31: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు.
- **వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి-** ఆర్మూర్‌టౌన్, జూలై31: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా ఆరోగ్య విద్యా బోధకురాలు స్వామి